క్లుప్తంగా

వెంకన్నకు పంచామృతాభిషేకం


అభిషేకాలు చేస్తున్న అర్చకుడు

పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై కొలువు దీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాత సేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం చేశారు. స్వామివారికి విశేష పూజలు జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

ఘనంగా మరిడిమాంబ ఆలయ వార్షికోత్సవం


అమ్మవారిని దర్శించుకుంటున్న నాయకులు

పెందుర్తి: మండలంలోని పెదగాడిలో వెలసిన మరిడిమాంబ ఆలయ 9వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి విశేష పూజలు చేశారు. పసుపు–కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం ప్రసాద వితరణ చేపట్టారు. జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, మాజీ సర్పంచ్ బొడ్డు అప్పలరాజు, నాయకులు మెంటి సూరిబాబు, బసవబోయిన రాము తదితరులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు.

మానసిక స్థైర్యంతో విద్యార్థుల్లో ఉన్నత స్థితి


విద్యార్థులతో మాట్లాడుతున్న కాకర నరేష్

పెందుర్తి: విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే పట్టుదల, కృషితో పాటు మానసిక స్థైర్యం కూడా ఎంతో అవసరం అని జిల్లా ఈఎండీపీ మేనేజర్ కాకర నరేష్ అన్నారు. సరిపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ విద్యార్థులు తమ దైనందిత జీవనంలో ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారం చూసుకునేలా మానసికంగా సిద్ధంగా ఉండాలన్నారు. తమ సంస్థ ద్వారా విద్యార్థులకు మానసిక స్థైర్యంపై విస్తృతంగా అవగాహన కలిగిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వి.సువర్చల, ఉపాధ్యాయులు ఎం.వి.విశ్వేశ్వరరావు, జి.వి.నిర్మల, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లి ఆలయంలో అన్నసమారాధన


భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న కమిటీ ప్రతినిధులు

సింహాచలం: అడవివరం పొలిమేర దేవత, శ్రీనివాసనగర్ తదితర ప్రాంతాల ఆరాధ్యదేవత, శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి సత్తెమ్మ తల్లి ఆలయంలో ప్రతి శుక్రవారం మధ్యాహ్నం రెండు వందల మందికి అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు తెలిపారు. ఆలయం వద్ద శుక్రవారం అన్నసమారాధనని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం మధ్యాహ్నం జరిగే అన్నసమారాధనలో భక్తులంతా పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పి.వెంకటరావు, కార్యదర్శి బలిరెడ్డి శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సందడిగా వీరాంజనేయ తీర్థమహోత్సవం

సబ్బవరం: మండలంలోని చినయాతపాలెంలో కొలువైన వీరాంజనేయస్వామి తీర్థమహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. వేకువజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. రాత్రి ఏర్పాటు చేసిన డ్యాన్స్ హంగామా ఉర్రూతలూగించింది. ఉత్సవ కమిటీ చైర్మన్ శరగడం దుర్గినాయుడు, సభ్యులు మళ్ల బాలాజీ, మళ్ల నాగభూషణం, దొడ్డి అప్పనాయుడు, శరగడం సత్యనారాయణ, మళ్ల గంగునాయుడు తదితరులు స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు జరిపారు.

పూత భళా.. తెగుళ్లతో విలవిల


నారపాడులో పూతతో ఉన్న మామిడి


జీడిమామిడి తోట

మామిడి, జీడిమామిడి తోటలకు తెగుళ్ల బెడద

తేనె మంచు, పూత మాడుపై రైతుల ఆందోళన

సస్య రక్షణ చర్యలతో దిగుబడులకు భరోసా

మండలంలో మామిడి, జీడిమామిడి సాగు వివరాలు

మామిడి సాగు	1,150 ఎకరాలు
జీడి మామిడి సాగు	1,300 ఎకరాలు
మామిడి, జీడి మామిడి సాగు రైతులు	3,500 మంది

జీడిమామిడి: ఆరిపాక, లగిశెట్టిపాలెం, బంగారమ్మపాలెం, అడ్డూరు శిరసపల్లి, బోదువలస, ఎల్లుప్పి, వంగలి, నారపాడు, నల్లరేగులపాలెం, రాయపుర అగ్రహారం గ్రామాల్లో జీడి మామిడి తోటలు ఎక్కువ.
మామిడి: అమృతపురం, సబ్బవరం, అడ్డూరు శిరసపల్లి, బోదువలస, అయ్యన్నపాలెం, ఎల్లుప్పి, మొగలిపురం, పైడివాడ, ఎరుకునాయుడుపాలెం, పైడివాడ అగ్రహారం, వంగలి, అసకపల్లి, గొటివాడ గ్రామాల్లో ఎక్కువగా **మామిడి సాగు జరుగుతోంది.**

సబ్బవరం: మండలంలో మామిడి, జీడి మామిడి సాగు ఎక్కువగా జరుగుతోంది. ఏటా పూత, పిందె సమయంలో అనేక రకాల పురుగులు, తెగుళ్ల సోకి దిగుబడులు గణనీయంగా తగ్గి, రైతులు నష్టపోతున్నారు. మామిడిలో ప్రధానంగా తేనె మంచు పురుగులు, తామర పురుగులు, కాయతొలుచు పురుగు, ఆకు మచ్చ, బూడిద తెగుళ్లు ఆశిస్తున్నాయి. జీడి మామిడిలో టీ దోమ, ఎర్ర నల్లి, కాండం తొలుచు పురుగు, పూత మాడు తెగులు, బూడిద తెగులు సోకి దిగుబడిపై ప్రభావం చూపిస్తున్నాయి. రైతులు సకాలంలో పురుగు మందులు పిచికారీ చేసినట్లయితే అధిక దిగుబడులతో పాటు మామిడిలో కాయ, జీడి మామిడిలో పిక్క నాణ్యత పెంచుకోవచ్చని వ్యవసాయ నిపుణులు చెప్పన్నారు.

సమగ్ర సస్యరక్షణ ప్రణాళిక

మామిడి, జీడి మామిడిలో ప్రణాళిక మేరకు మూడు విడతల్లో పురుగు మందులు పిచికారీ చేయడం ద్వారా పంటను సంరక్షించుకోవచ్చు.

- మొదటి పిచికారీలో అసిఫేట్ 1.5 గ్రా./క్లోరోఫైరోఫాస్ 2 మి.లీ./ డైక్లోరోవాస్ –1 మి.లీ. మరియు మాంకోజెబ్ 2 గ్రా.ను లీటర్ నీటిలో కలిపి కాండం మొత్తం, మొదలు తడిచేలా పిచికారీ చేసుకోవాలి.
- రెండవ పిచికారీలో ఇమిడాక్లోప్రిడ్–0.5 మి.లీ./ పిప్రోనిల్ 2 మి.లీ./ ప్రోఫినో పాస్ 2 మి.లీ. మరియు సాఫ్/కంపానియన్ 2 గ్రాముల్ని లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలి.
- మూడవ పిచికారీలో పిందె/పిక్క బఠాణీ సైజు తర్వాత అవసరమైతే లామిడా సైలోత్రిన్ 1 మి.లీ./ పెగాసస్ 1 గ్రా./ సైపర్ మెత్రిన్ 1 మి.లీ. మరియు రిడోమిల్ 2 గ్రాముల్ని లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- **పోషక లోపాలను అధిగమించేందుకు పూత మొగ్గల్ని ఉత్తేజ పరిచి త్వరగా పూత రావడా**నికి పోటాషియం నైట్రేట్ 10 గ్రాములు, యూరియా 5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- బోరాన్ లోపం నివారణకు బోరాక్స్/బోరాన్ 2 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఆ తరువాత కాయ/పిక్క సైజు పెరగడానికి పూతంతా పిందె దశకు చేరిన తరువాత 19:19:19 ఎరువు 10 గ్రాములు లీటర్ నీటికి చొప్పున అవసరమైనంత పిచికారీ చేసుకోవాలి.


మామిడిలో సస్యరక్షణ చర్యలపై తోటబడి కార్యక్రమంలో ఉద్యానశాఖ సిబ్బంది

ఈ విధంగా ఉద్యానవన అధికారులు పేర్కొన్న మేరకు సకాలంలో పురుగు మందులు తగు మోతాదులో వాడి, పోషకాలు కూడా అందించినట్లయితే మామిడి, జీడి మామిడి తోటల్లో పురుగు, తెగుళ్లు, పోషక లోపాల వల్ల కలిగే నష్టాలను అధిగమించవచ్చు.

జీడిమామిడిపై అప్రమత్తం

జీడి మామిడిలో సకాలంలో ఎరువుల వాడకం, కొమ్మ కత్తిరింపు వంటి యాజమాన్య పద్ధతులు అవలింభించక పోవడంతో టీ దోమ ఎక్కువగా సోకుతోంది. పురుగులు, తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టకపోవడం కూడా దిగుబడి తగ్గడానికి ఓ కారణం. జీడిమామిడిలో పూతమాడు తెగులు సాధారణంగా పూత ఎదుగుతున్న కొమ్మల్నే ఆశిస్తుంది. తెగులు సోకిన పువ్వుల గుత్తులు మాడి రాలిపోతాయి. ఎదుగుతున్న గింజలు మెత్తబడి పూర్తిగా ఎదగక ముందే నేల రాలిపోతాయి. పూత మాడు తెగులు నివారణకు ఎసిఫేట్ 1 గ్రాము మరియు కార్బెండిజమ్ 1.0 గ్రాము రసాయనాన్ని లీటర్ నీటిలో కలిపి చెట్టంతా తడిచేలా పిచికారీ చేసుకుంటే ప్రయోజనం ఉంటుంది.

తేనె మంచుతో పూతకు ప్రమాదం


జీడి మామిడి ఆరెకరాలు, మామిడి సుమారు ఎకరాలో సాగుచేస్తున్నా. ప్రస్తుతం పూత దశలో ఉంది. ఏడాదికి రెండు సార్లు మందులు పిచికారీ చేసేవాళ్లం. రెండేళ్లుగా చేయట్లేదు. ప్రస్తుతం నీటి మంచు కురుస్తోంది. ఇది పర్లేదు. తేనె మంచు కురిస్తే మాత్రం పూత దెబ్బతినే అవకాశాలు చాలా ఎక్కువ.
– అంగటి కోటేశ్వరరావు, ఎ.శిరసపల్లి

రెండేళ్లుగా పూత దెబ్బతింటోంది


రెండెకరాల్లో జీడి మామిడి, మామిడి ఉంది. రెండేళ్లుగా జీడి మామిడి పూత దెబ్బతిని ఆశించిన స్థాయిలో దిగుబడులు రావట్లేదు. దీంతో పాటు జీడి పిక్కల ధర కూడా పెద్దగా లేకపోవడంతో నష్టాలను చవి చూస్తున్నాం. మామిడిది కూడా అదే పరిస్థితి. పంట చేతికి వచ్చే వరకూ చెప్పలేం.
– వడిశల నూకాలమ్మ, తెలుకులపాలెం

సస్య రక్షణ చర్యలతో లాభాలు


సకాలంలో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు చేపట్టడం వలన జీడి మామిడి తోటల్లో పురుగు, తెగుళ్లు నివారించవచ్చు. పోషక లోపాల వలన కలిగే నష్టాలను అధిగమించవచ్చు. దీంతో జీడి మామిడి, మామిడి తోటల్లో ఆశించిన స్థాయిలో దిగుబడులను సాధిస్తూ లాభసాటిగా మార్చుకోవచ్చు. – **కిరణ్మయి**, ఉద్యాన శాఖ అధికారి, సబ్బవరం మండలం

శారదాపీఠంలో త్రివేణి కుంభ స్నపనం

- పూర్ణాహుతితో ముగిసిన వార్షికోత్సవాలు


అమ్మవారికి పూజలు చేస్తున్న స్వాత్మానందేంద్ర

పెందుర్తి: చినముషిడివాడలోని శారదాపీఠంలో ఐదు రోజుల పాటు నిర్వహించిన వార్షిక మహోత్సవాలు శుక్రవారం శాస్త్రోక్తంగా ముగిశాయి. ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ చేతుల మీదుగా త్రివేణి సంగమం ప్రయాగ్‌రాజ్ కుంభమేళా నుంచి తీసుకువచ్చిన పవిత్ర జలంతో రాజశ్యామల అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు జరిపారు. అనంతరం విశేషాలంకరణలో అమ్మవారికి పూజలు చేశారు. నాలుగు రోజులుగా జరుగుతున్న రాజశ్యామల యాగం పూర్ణాహుతిని వేదమంత్రోక్తంగా జరిపారు. మధ్యాహ్నం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు ఉత్సవాల్లో పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు


అన్నసమారాధన ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వసంత

పెందుర్తి: చినముషిడివాడలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ అష్టాదశ(18వ) వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. పంచలోహ విగ్రహాలకు జీవకళావాహన జరిపారు. మధ్యాహ్నం జరిగిన అన్నసమారాధనను కార్పొరేటర్ శానాపతి వసంత, శంకర్రావు చేతుల మీదుగా ప్రారంభించారు. దాదాపు 2 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు బి.చిన్నారావు, రాజు, ఈశ్వరరావు, మహేష్, రాంబాబు, సాధూరావు, సన్నిబాబు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న వార్షిక కల్యాణోత్సవాలకు అంకురార్పణ

నేడు భీష్మ ఏకాదశి కల్యాణోత్సవాలు


వెంకన్న ఆలయంలో కల్యాణోత్సవానికి అంకురార్పణ పూజలు చేస్తున్న అర్చకులు

సింహాచలం: భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవాలకు శుక్రవారం రాత్రి అంకురార్పణ చేశారు. పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం అర్చకులు ఈ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణాన్ని జరిపారు. అంకురార్పణ పూజలు చేశారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు భార్గవ్, వేదపండితులు కార్యక్రమాలను నిర్వహించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం గ్రామ తిరువీధి, రాత్రి 7 గంటల నుంచి స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు.

నేడు ఉపాలయాల్లో కల్యాణోత్సవాలు

భీష్మ ఏకాదశి సందర్భంగా సింహాచలం దేవస్థానానికి చెందిన ఉపాలయాల్లో కల్యాణమహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతకస్వామి ఆలయంలో రాత్రి 9.30 గంటల నుంచి గ్రామ తిరువీధి, అనంతరం కల్యాణోత్సవం జరపనున్నారు. మాధవధారలోని మాధవస్వామి ఆలయంలో సాయంత్రం 5 గంటల నుంచి కల్యాణోత్సవం, రాత్రి 8.30 నుంచి గ్రామ తిరువీధి, ఇక్కడి వేణుగోపాలస్వామి ఆలయంలో రాత్రి 7.30 గంటల నుంచి కల్యాణోత్సవం, అనంతరం తిరువీధి నిర్వహించనున్నారు.

వైభవంగా భూలోకమాంబ ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు


చతుర్వేద పారాయణం నిర్వహిస్తున్న పండితులు


అమ్మవారి విగ్రహానికి క్షీరాభిషేకం

సింహాచలం: 98వ వార్డు అప్పన్నపాలెంలో కొలువుదీరిన భూలోకమాంబ నూతన ఆలయ, విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు రెండవరోజు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి చతుర్వేద పారాయణం, ఆవాహన దేవతార్చన, సూర్యనమస్కారాలు, మహాలింగార్చన, మహన్యాసపూర్వక మహారుద్రాభిషేకం, సాయంత్రం మహిళలతో సామూహిక కుంకుమార్చనలు, సర్వదేవతా హోమాలు, ధాన్యాధివాసం, పంచశయ్యాధి వాసం, అష్టదిగ్బలి ప్రదానం, చతుర్వేద స్వస్తి తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పీతల అప్పలరాజు, పీతల విష్ణుమూర్తి, పళ్లా వెంకటరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. శనివారం ఉదయం 11.13 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ, యంత్ర ప్రతిష్ఠ కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

బెల్ట్ దుకాణాలపై పోలీసుల దాడులు

- ముగ్గురి అరెస్ట్.. 20 బాటిళ్ల మద్యం స్వాధీనం
- పరవాడలోని తాడి కాలనీలో మరొకరిపై కేసు.. మద్యం స్వాధీనం


ముదపాకలో బెల్ట్ దుకాణం వద్ద నిందితుడు, పట్టుకున్న మద్యంతో సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న మద్యం బెల్ట్ దుకాణాలపై పోలీసులు శుక్రవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఐదు బృందాలు దాడులు చేయగా పులగానిపాలెం, ముదపాక, నరవవానిపాలెం ప్రాంతాల్లో బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి వద్ద ఉన్న 20 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిపై ఎక్సైజ్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు. బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

10 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ: మండలంలోని తాడి కాలనీకి చెందిన అట్టా దుర్గాలమ్మ స్థానిక వైన్‌షాపు నుంచి 10 మద్యం సీసాలు కొనుగోలు చేసి, అక్రమంగా తరలిస్తుండగా పరవాడ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఈ మద్యం సీసాలు విలువ రూ.1,042 ఉంటుందని, మద్యం సీసాలను అక్రమంగా తరలిస్తున్న దుర్గాలమ్మపై కేసు నమోదు చేసినట్లు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు.

టెన్త్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలి'


విద్యార్థులతో మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సత్యనారాయణ

పెందుర్తి: రానున్న పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ అన్నారు. పెందుర్తి ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలోని ఎస్ఆర్ సంక్రన్ విజ్ఞాన కేంద్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న తీరును పర్యవేక్షించారు. పలు అంశాలపై విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం


రేషన్ కిట్‌లు అందిస్తున్న చిన్మయిదేవి, నీలవేణి

పెందుర్తి: గర్భిణులు, బాలింతలు, కౌమార దశ పిల్లలు నిత్యం పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని ఐసీడీఎస్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి అన్నారు. పెందుర్తి పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. బాలింతలకు, గర్భిణులకు రేషన్ కిట్లను అందించారు. సీడీపీవో నీలవేణి, సూపర్‌వైజర్ మానస, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కూలి రేట్లు పెంచాలని ఆందోళన


ఆందోళన చేస్తున్న హమాలీలు

పెందుర్తి: స్థానిక సివిల్ సప్లయ్ గొడౌన్‌లో పనిచేస్తున్న హమాలీలకు కూలి రేట్లు తక్షణమే పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మన్మధరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక సివిల్ సప్లయ్ గోదాం వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడితే కూలి రేట్లు పెంచుతామని పౌరసరఫరాల శాఖ మంత్రి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ నేటికీ ఆ హామీ అమలు కాలేదన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి కూలీల డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, ధర్నాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొల్లి సన్యాసిరావు, ప్రతినిధులు దమ్ము రాజు, రామకృష్ణ, నూకరాజు, శ్రీరామ్, రాడి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా క్షతగాత్రుడికి గండి రవి పరామర్శ


క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్

పరవాడ: ఫార్మాసిటీలో కామన్ ఎంప్లాయిస్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో ఇటీవల జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కరణం ముత్యాలును వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ శుక్రవారం పరామర్శించారు. సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారం శివారు పీతపాలెం గ్రామంలో ముత్యాలు ఇంటికి వెళ్లి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రుడికి మెరుగైన వైద్యం అందించడంతో పాటు అన్ని విధాలా ఆదుకోవాలని యాజమాన్యాన్ని కోరారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు కరణం శ్రీను, దాసరి శ్రీను, నక్క వాసు, యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, ఐడీ బాబు, సిరపరపు వాసు, కరక రాము, జి.శ్రీనివాస్, పైల రామునాయుడు, ఎస్.నవీన్ ఉన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం


విద్యార్థులకు హ్యాండ్‌వాష్ లిక్విడ్ అందిస్తున్న ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్ బక్షి

పరవాడ: వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని విశాఖ ఫార్మాసిటీ డిప్యూటీ జనరల్ మేనేజర్ గిరిధర్ బక్షి సూచించారు. ఫార్మాసిటీ పునరావాస కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం వ్యక్తిగత పరిశుభ్రతపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. పిల్లల్లో వచ్చే వ్యాధులు చాలా వరకు అపరిశుభ్రత వల్లే వస్తాయన్నారు. పరిశుభ్రతపై విద్యార్థులు, తల్లిదండ్రులు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతపై పాఠశాల విద్యార్థులు ప్రసంగించడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు చేతులు కడుక్కోవడంపై అవగాహన కల్పించారు. ఏడాదికి సరిపడా హ్యాండ్ వాష్ లిక్విడ్ అందించారు. కార్యక్రమంలో రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ కె.శ్రీకాంత్, రీసస్టైనబిలిటీ హెచ్ఆర్ బాలాజీ, ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.వి.రామిరెడ్డి, ఉద్యోగులు, సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

పెందుర్తి: జోన్–8 పరిధిలోని ప్రాంతాలకు శనివారం ఉదయం నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని జీవీఎంసీ వాటర్ సప్లై ఈఈ బి.మురళీకృష్ణ తెలిపారు. 93వ వార్డు(భాగం) నుంచి 98వ వార్డుల పరిధిలో ఉన్న సాయిదుర్గానగర్, దుర్గానగర్, అప్పలనరసింహంకాలనీ, లక్ష్మీపురం, పోర్టుకాలనీ, రామ కోఆపరేటివ్ కాలనీ, హెచ్‌బీ కాలనీ, గోకుల్‌ధా కాలనీ, రెల్లి వీధి, కృష్ణరాయపురం, గొల్లవిల్లివానిపాలెం, ఎల్ఐసీ కాలనీ, సుజాతనగర్, పాపయ్యరాజుపాలెం, పెందుర్తి పాతూరు, తెలకల వీధి, పెందుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంతం, ప్రశాంతినగర్, క్రాంతినగర్, వుడాకాలనీ, రైల్వే కాలనీ, ప్రశాంతినగర్, సావిత్రినగర్, అప్పన్నపాలెం, సింహపూరి లేవుట్, అడవివరం, ఎస్సీ కాలనీ, పాత అడవివరం, అడవివరం ప్రాంతాల్లో మంచినీటి సరఫరా ఉండదన్నారు.